ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
కామారెడ్డి
జిల్లా వార్తలు
5
శనివారం 4 అక్టోబరు 2025





ఖర్చు చేశాక.. రిజర్వేషన్లు మారితే?

స్థానిక సంస్థల ఎన్నికలపై సర్వత్రా అయోమయం నెలకొంటోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇదే అంశంపై హైకోర్టులో కేసు కొనసాగుతోంది. అక్టోబరు 8న ఈ కేసు విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా స్థానాలకు ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు ఆశావహుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. తీరా ఖర్చు చేసిన తర్వాత రిజర్వేషన్లు మారితే తమ భవిష్యత్తు ఏమిటనే ప్రతీ ఒక్కరిలో మెదులుతున్న ప్రశ్న. రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు తీర్పు తర్వాతే ముందుకు వెళ్లాలని మెజార్టీ ఆశావహులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల ఖర్చుల విషయంలో అప్పటి వరకు వేచి చూడడమే మంచిదని ఆశావహులు అభిప్రాయపడుతున్నారు.

- స్థానిక ఎన్నికలపై కొనసాగుతున్న సందిగ్ధత
- రిజర్వేషన్ల వ్యవహారం కోర్టులో ఉండడంతో అనిశ్చితి
- 9వ తేదీ తర్వాతే స్పీడప్ చేసే యోచనలో ఆశావహులు
- ఎన్నికల ఏర్పాట్లలో మాత్రం జిల్లా అధికారులు
- జిల్లాలో 25 జడ్పీటీసీ 233 ఎంపీటీసీ స్థానాలు
- 532 సర్పంచ్ స్థానాలు

కామారెడ్డి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఎంత చెప్పినా.. నిబంధనలను ఎన్ని అమలు చేసినా.. ఫ్లెక్సీలు పత్రికా ప్రకటనల రూపంలో హెచ్చరికలు జారీ చేసినా గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి ఓటుకు నోటు సాధారణమే. పోటీలో ఉండాలనుకునే ఆశావహుల నుంచి ఓటర్లు ఎంతో కొంత ఆశిస్తూనే ఉంటారు. నామినేషన్లు మొదలుకొని ఇంటింటి ప్రచారంలో భాగంగా కరపత్రాలు, వాల్‌పోస్టర్లు, ఫ్లెక్సీలకు ఎంతో కొంత ఖర్చు చేయాల్సిందే. ప్రచారంలో భాగంగా రోజు వెంట వచ్చే కార్యకర్తలు, ముఖ్య నాయకులకు భోజనం కల్పించడంతో పాటు మద్యం సరఫరా చేయాల్సిందే. జడ్పీటీసీకి పోటీ చేసే అభ్యర్థి కనీసం రూ. కోటి, ఎంపీపీ పదవి ఆశించే అభ్యర్థి రూ.50 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పండుగల సమయంలో మామూలు ఇచ్చిపుచ్చుకోవడం సహజమే. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని కొంతమంది ఆశావహుల నుంచి మద్యం ఆశిస్తుంటారు. అసలే ఎన్నికల సమయం అడిగిన వాళ్లను కాదంటే తమకు ఓటు వేయరనే భయం అభ్యర్థులను వెంటాడుతోంది. తమ వద్ద లేకపోయినా అప్పు చేసి మరీ ఆయా ఓటర్ల ఆంక్షలు, ఆశలు నెరవేర్చాల్సిన పరిస్థితి నెలకొంటొంది. ఈ ఖర్చులను భరించలేని శక్తి లేనివారు ఏదో ఒక సాకుతో ఊరు నుంచి ఇతర ప్రాంతాలకు కనిపించకుండా వెళ్లిపోతున్నారు. మరికొంత మంది ఫోన్లు స్విచ్ ఆఫ్ చేసుకుంటున్నారు.

తీర్పు భిన్నంగా వస్తే..

జిల్లాలో 25 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, 233 ఎంపీటీసీ స్థానాలు, 532 గ్రామ పంచాయతీలు, 4,656 వార్డు స్థానాలు ఉన్నాయి. పార్టీ గుర్తుపై నిర్వహించే ఒక్కో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానానికి అధికార కాంగ్రెస్ నుంచి ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీల నుంచి ఒక్కొక్కరు చొప్పున బరిలో ఉండే అవకాశం ఉంది. వీరితోపాటు మరో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉండవచ్చు. ఇలా ఒక్కో స్థానం నుంచి కనీసం 8 నుంచి 10 మంది వరకు పోటీలో ఉండనున్నారు. జిల్లా వ్యాప్తంగా జడ్పీటీసీ స్థానాలకు 220 మంది వరకు, ఎంపీటీసీ స్థానాలకు 2400 మంది వరకు పోటీ చేయనున్నారు. ఇక పార్టీ గుర్తులకు అతీతంగా నిర్వహించే ఒక్కో సర్పంచ్ స్థానానికి కనీసం ముగ్గురు నుంచి నలుగురు అభ్యర్థుల చొప్పున 2వేల మంది వరకు పోటీలో ఉండనున్నారు. ఒక్కో వార్డుకు ఇద్దరు ముగ్గురు చొప్పున పదివేల మంది అభ్యర్థులు పోటీలో ఉండే అవకాశం ఉంది. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని రాజ్యాంగ సూత్రానికి విరుద్ధంగా జీవో జారీ చేయడం, కొంత మంది ఇప్పటికే ఆ అంశంపై కోర్టుకు వెళ్లడం, అక్టోబరు 8న హైకోర్టు విచారణ చేపట్టనున్నట్లు తెలిసిందే. ప్రకటించిన రిజర్వేషన్లకు భిన్నంగా తీర్పు వస్తే తమ పరిస్థితి ఏమిటనే ప్రశ్న సర్వత్ర వ్యక్తమవుతోంది.



గాంధీగంజ్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఆశయసాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. గురువారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొల్పడంలో ఆయన చూపిన మార్గం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని స్పష్టం చేశారు. మహాత్ముని అనుసరణ మనకు శిరోదార్యమని అన్నారు. నేను మరో సారి పోరాటం చేయాల్సి వస్తే స్వాతంత్ర్యం కన్న పారిశుద్యం, పరిశుభ్రత కోసం పోరాటం చేస్తానని గాంధీ చెప్పిన మాటలను ఆయన ఉదాహరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, తహసీల్దార్ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

స్థానిక ఎన్నికల్లో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పోటీ చేయాలి

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ పోటీ చేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పార్టీకి సేవ చేస్తున్న కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అయ్యే అవకాశం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉంటుందని తెలిపారు. ఒక వేళ రిజర్వేషన్ కారణంగా పోటీ చేసే అవకాశం లేనివారు పోటీ చేసేవారిని గెలిపించే బాధ్యత తీసుకోవాలని తెలిపారు. కేంద్రప్రభుత్వ పథకాలను, నరేంద్రమోదీ సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకం కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిన్నరాజులు,మాజీ ఎమ్మెల్యే అరుణతార, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దసరా ఉత్సవాలు

- ఈ సంవత్సరం జోష్‌గా ఉత్సవాలు
- జమ్మిచెట్టుకు పూజలు, పలుచోట్ల రావణదహనాలు
- పెరిగిన ధరలతో ఒకింత దిగాలుగా ప్రజలు
- నిమజ్జనానికి తరలిన దుర్గమాత ప్రతిమలు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా అంటేనే సరికొత్త సందడి.. కొత్త బట్టలు, పిండివంటలు, కుటుంబ సభ్యులు ఒక్కచోట చేరి ఆ జోష్ వేరే ఉంటుంది. ఈ సంవత్సరం కొద్దిగా కొనుగోలు పెరిగినా ప్రతీ దసరాకు ఉన్న విధంగా వ్యాపారం జరగలేదని వ్యాపారస్తులు పేర్కొంటున్నారు. వస్త్ర వ్యాపారంతో పాటు బంగారం వ్యాపారం సైతం అంతంత మాత్రంగానే ఉంది. ముఖ్యంగా కూరగాయల ధరలు రెట్టింపయ్యాయి. మార్కెట్‌లో ఏ రకం కూరగాయలు చూసిన రూ.80 నుంచి 100 వరకు విక్రయిస్తున్నారు. పెరిగిన ధరలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి ఉందని పేర్కొంటున్నారు. పెరిగిన ధరల మూలంగా పండుగను గతంలో కంటే అంతంత మాత్రంగానే పండుగలు జరుపుకున్నట్లు పలువురు పేర్కొన్నారు. కాగా అన్ని ఆలయాల వద్ద వాహనపూజలు నిర్వహించారు.

అన్ని మండలాల్లో ఘనంగా సంబరాలు

దసరా ఉత్సవాల్లో భాగంగా గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయం, విద్యానగర్ సాయిబాబా ఆలయం, శివాలయం, హౌసింగ్‌బోర్డు కాలనీలోని సంకష్టహర గణపతి ఆలయం, శారదాదేవి ఆలయం, ఎన్‌జీవోఎస్ కాలనీలోని సీతారామాంజనేయ ఆలయం, వివేకానంద కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, జయశంకర్‌కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, వికాస్‌నగర్‌కాలనీ, ధర్మశాల, అయ్యప్ప ఆలయం, కన్యకా పరమేశ్వరీ ఆలయం, రేణుకా ఎల్లమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు జంబికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పంపిణీ చేశారు. భక్తులు జంబిని తీసుకొని ఒకరికొకరు పంచుకొని ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కామారెడ్డి శివారులో పాలపిట్ట ప్రదర్శనను వీక్షించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాజేష్ చంద్ర, ఏఎస్పీ చైతన్యరెడ్డి, పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులతో కలిసి ఆయుధ పూజ నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ఆయా నాయకులు కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ కొంపల్లిలోని తన నివాసంలో జంబిచెట్టుకు పూజలు నిర్వహించారు. కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గర్గుల్‌లో రావణ దహన కార్యక్రమం చేపట్టారు. కామారెడ్డి మండలం ఉగ్రవాయి మైసమ్మ ఆలయం, చుక్కాపూర్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.



బాన్సువాడలో జంబి చెట్టుకు పూజ చేస్తున్న పోచారం

నిమజ్జనానికి తరలిన అమ్మవారు

నవరాత్రులు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తు పూజలు అందుకున్న అమ్మవారి ప్రతిమలు నిమజ్జనానికి తరలాయి. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లో, గ్రామగ్రామాన దుర్గామాతను ప్రతిష్ఠించి నిష్ఠతో పూజలు నిర్వహించడంతో పాటు రాత్రి సమయంలో దాండియా ఆడుతూ ప్రజలు సంబురంగా గడిపారు.

బాన్సువాడ టౌన్: చెడుపై మంచి సాధించిన విజయమని నేడు అందరం కలిసి విజయదశమిగా జరుపుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన కుటుంబ సభ్యులు, ఆగ్రోస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్‌తో కలిసి పట్టణంలోని మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ప్రజలందరికీ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామపెద్దలతో కలిసి జంబిచెట్టుకు పూజలు నిర్వహించారు. మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాటు చేసిన రావణదహన కార్యక్రమాన్ని తిలకించారు. బాన్సువాడ పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి రావణదహన కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు న్నారు.



ఎస్పీ కార్యాలయంలో పూజ నిర్వహిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర



నిజాంసాగర్ 5 వరద గేట్ల మూసివేత

- 10 వరద గేట్ల కొనసాగింపు
- మంజీరాలోకి 79వేల 820 క్యూసెక్కులు
- ఇన్‌ఫ్లో లక్షా 8వేల 648 క్యూసెక్కులు

నిజాంసాగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోని 5 వరద గేట్లను శుక్రవారం నీటి పారుదల శాఖ అధికారులు మూసివేశారు. వీఆర్ నెంబర్ 5లోని 6 గేట్లను, వీఆర్ నెంబర్ 4లోని 4 గేట్లను కొనసాగిస్తు 79 వేల 820 క్యూసెక్కుల నీటిని మంజీరాలోకి వదిలివేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి లక్షా 8 వేల 648 క్యూసెక్కుల వరద నీరు వస్తూనే ఉంది. నిజాంసాగర్ పూర్తి నీటి మట్టాన్ని నిలంవ చేసేందుకు అధికారులు 5 వరద గేట్లను మూసివేస్తు 10 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్ట్ పూర్తి నీటి మట్టం 1405 అడుగులకు గాను 1402.64 లుగా ఉంది. నిజాంసాగర్ పూర్తి నీటి మట్టం మరో ఏడు అడుగుల నీటిని నిలువ చేసినట్లయితే పూర్తిస్థాయి నీటి మట్టం నిలువ కానున్నది. ప్రస్తుతం నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీల నీటి సామర్థ్యం కాగా, ప్రస్తుతం 14.384 టీఎంసీల నీటి మట్టం ఉంది. ప్రధాన కాలువ ద్వారా 900 క్యూసెక్కుల నీటి విడుదల కొసాగిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి అక్షయ్ కుమార్ మాట్లాడుతు ప్రాజెక్ట్ వరద గేట్లను కొంచెం కొంచెం మూసివేసి పూర్తి స్థాయి నీటిమట్టం అయిన తర్వాత తిరిగి వరద ఉధృతి ఉంటే గేట్లను తిరిగి ఎత్తుతామని తెలిపారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడటం ప్రతీ ఒక్కరి బాధ్యత



అడ్లూర్ ఎల్లారెడ్డిలో నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొన్న స్వయం సేవకులు

సదాశివనగర్, అక్టోబరు 3: దేశంలో, రాష్ట్రంలో హిందూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ ప్రాంత సహ భౌతిక్ ప్రముఖ్ నర్ర వెంకట శివకుమార్ అన్నారు. దసరా ఉత్సవాలు, ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలో గురువారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వక్త మాట్లాడుతూ పరమపూజనీయ డా.కేశవరావ్ బలిరాం హెడ్గెవార్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను 1925లో విజయదశమి పర్వదినాన స్థాపించారన్నారు. సంఘటిత భారతదేశ నిర్మాణంలో నిమగ్నమైన సంఘం, ఈ విజయదశమికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో సంస్కృతి, సంప్రదాయాలను కొన్నిశక్తులు దెబ్బతిస్తున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని అన్నారు. దేశ రక్షణకు, హిందు ధర్మ రక్షణకు ప్రతీ ఒక్కరం నడుం బిగించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ సంఘచాలక్ కోమురెడ్డి స్వామి, విభాగ సహకార్యవాహ పాపయ్యగారి గోవర్ధన్, బస్తీ ప్రముఖ ఎండ్రియాల రాజేందర్‌గౌడ్, విద్యార్థి పరిషత్ వ్యవస్థాపన స్వామిరెడ్డి, సీనియర్ కార్యకర్తలు సదాశివరెడ్డి, సంకరి విఠల్, మల్లేష్ యాదవ్, స్వయం సేవకులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

గల్లీల్లో.. గ్యాంగ్‌వార్!

- మద్యం మత్తులో యువత
- జిల్లా కేంద్రంలో రాత్రయితే ఇదే పరిస్థితి
- పలుచోట్ల వేడుకల పేరిట రహదారులపై చక్కర్లు
- పోలీసు పెట్రోలింగ్ తగ్గడంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 3(ఆంధ్ర జ్యోతి): గత కొంత కాలంగా జిల్లా కేంద్రంలోని గల్లీల్లో గ్యాంగ్‌వార్ సంస్కృతి పెరుగుతోంది. జులాయిగా తిరుగుతున్న పలువురు యువకులు బ్యాచ్‌లుగా వీడిపొయి గొడవలకు దిగుతున్నారు. ఇందులో పలువురు గంజాయి, మద్యం మత్తులో పరస్పర దాడులు చేసుకుంటున్నారు. దీంతో కొన్నిసార్లు హత్యల వరకు వెళ్తుండగా.. ఇంకొన్ని సార్లు క్షతగాత్రులవుతున్నారు. అయితే రాత్రి వేళ ఈ గొడవలు ఎక్కువగా జరుగుతుండగా పోలీసు నిఘా కరువవడంతో అడ్డుకునే వారే లేకుండా పోయారనే విమర్శలు లేకపోలేదు. గతంలో రాత్రి వేళల్లో రెండు సార్లు పోలీసు పెట్రోలింగ్ వాహనాలు, బైక్‌ల మీద కానిస్టేబుళ్లు ప్రధాన రహదారులతో పాటు అంతర్గత కాలనీల్లో తిరుగుతుండేవారు. ప్రస్తుతం గత కొంత కాలంగా పోలీసు పెట్రోలింగ్ తగ్గడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ఫలితంగా జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లోని ప్రజలు నిద్రమాని ఆందోళనలతో గడపాల్సి వస్తోంది.

పార్టీల పేరిట చక్కర్లు

పట్టణంలో పలువురు యువకులు బర్త్‌డే ఫంక్షన్‌ల పేరుతో ద్విచక్రవాహనాలు, కార్లలో తిరుగుతూ నడిరోడ్డు మీద కేక్‌లు కట్‌చేస్తు అర్ధరాత్రి 2 గంటల వరకు ఊరంతా చక్కర్లు కొడుతున్నారు. రోడ్లపై అధిక శబ్దాలు వచ్చే వాహనాలతో చక్కర్లు కొడుతూ అందరిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఇక బరత్‌లు, సంబరాల పేరిట జరుపుకుంటున్నారు. డగా పలువురు ఆకతాయిలు తోక చుట్టాలు, స్నేహితుల పేరుతో బయట మద్యం తాగి వచ్చి నృత్యాలు చేస్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నారు. ఎవరైన అడ్డుకుంటే వారిపై దాడులు చేసేందుకు వెనుకాడడం లేదు. ఎవరైన పోలీసులకు సమాచారం అందిస్తే వారు అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిపై తిరగబడుతున్నారు. ఈ పరిస్థితుల్లో గతంలో చాలానే చోటు చేసుకున్నాయి. ఇక పట్టణ శివారుల్లో ఉన్న ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను ఎంచుకుని మాదకద్రవ్యాలతో పాటు మద్యం తాగుతూ నానా గొడవలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానికంగా ఉండే ఎవరైన ప్రశ్నిస్తే మద్యం మత్తులో దాడులకు సైతం పాల్పడుతున్నారు. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఓ యువకుడిపై గంజాయి మత్తులో పలువురు యువకులు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తగ్గిన పోలీసు పెట్రోలింగ్

గతంలో రాత్రి అయిందంటే చాలు తెల్లవారే సరికి రెండు సార్లు పోలీసు వాహనాలు కూయి.. కూయి అంటూ పెట్రోలింగ్ చేస్తుండేవి. వాటికి తోడు మధ్యమధ్యలో ద్విచక్రవాహనాలపై అంతర్గత గల్లీల్లో కానిస్టేబుళ్లతో పాటు హోంగార్డులు విధులు నిర్వహించేవారు. రాత్రి 11 దాటిదంటే చాలు ఎవరైన గుంపుగా కనిపిస్తే ఇక్కడ ఏం పని అంటూ ప్రశ్నించే వారు. సెకండ్ షో సినిమాకు వెళ్లి వస్తున్న వారిని సైతం ఆపి టికెట్ చూపమనేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి చాలా చోట్ల కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తూతూ మంత్రంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారని దీంతో యువకులు తమకు నచ్చినట్లుగా రోడ్లపై అర్ధరాత్రి వరకు హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి పెట్రోలింగ్‌ను గతంలో మాదిరి చేపట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్రైం సమాచారం

మహిళ దారుణ హత్య


శీలంవార్ లింగవ్వ (ఫైల్)

ఎడపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని జైతాపూర్ శివారులో ఓ మహిళ హత్యకు గురైనట్లు ఎస్సై ముత్యాల రమ తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. జైతాపూర్ గ్రామ శివారులో మృతదేహం ఉందన్న సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతురాలిని శీలంవార్ లింగవ్వగా గుర్తించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కొండల్‌వాడీ గ్రామానికి చెందిన శీలంవార్ లింగవ్వ(55) అనే మహిళ తన ఇంటి నుంచి సెప్టెంబరు 28న మండలంలోని పోచారం గ్రామంలో గల తన చెల్లెలి కుమారుడైన బెజ్జంకి వెంకట్ ఇంటికి బయలుదేరింది. కానీ అక్కడికి చేరుకోకపోవడంతో మండలంలోని జంలం గ్రామంలో గల మృతురాలి కుమార్తె కుంటి సురేఖ అక్టోబరు 2న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.. సంఘటనాస్థలానికి కుంటి సురేఖను పిలిపించగా మృతురాలు శీలంవార్ లింగవ్వగా గుర్తించిందన్నారు. దీంతో శవాన్ని పంచనామా నిర్వహించి తదుపరి దర్యాప్తు నిమిత్తం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కామారెడ్డిలో కత్తిపోట్ల కలకలం

కామారెడ్డి టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో గురువారం అర్ధరాత్రి గ్యాంగ్ వార్ చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పలువురు యువకులు పాత కక్షల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని శాస్త్రి దుర్గామాత మండపం సమీపంలో తగదా పడ్డారు. అది కాస్త మటన్ మార్కెట్ సమీపంలోని చిన్నకసాబ్‌గల్లిలో రెండు గ్రూప్‌లు కొట్టుకునే స్థాయికి చేరుకుంది. దీంతో స్థానికంగా ఉండే కటికే బాలాజీ అనే వ్యక్తితో పాటు పలువురు ఆ రెండు గ్రూపులను అక్కడి నుంచి తరమివేశారు. తమనే కొడతారా అంటూ గొడవపడుతున్న వారితో పాటు మరికొంత మంది అక్కడికి చేరుకుని బాలాజీని తీవ్రంగా గాయపరిచారు. ఇందులో గుర్తు తెలియని యువకుడు కత్తితో దాడి చేయడంతో ముగ్గురు యువకులకు వెనుక భాగంలో కత్తిగాయాలు కాగా వారు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. బాలాజీ సైతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులకు గొడవకు సంబంధించిన సమాచారం రావడంతో వారిని ఘటనాస్థలానికి చేరుకుని తగదా పడుతున్న యువకులను చెదరగొట్టారు. పలువురు వీక్లి మార్కెట్‌లోకి చేరుకోవడం, అక్కడ సైతం గొడవపడడంతో వారిపై లాఠీచార్జి చేసి పంపించేశారు. అదేవిధంగా విద్యానగర్‌లోనూ పలువురు యువకులు పోలీసుల విధులకు ఆటంకం కల్గించడంతో వారిపై సైతం కేసు నమోదు చేశారు. ఈ విషయంపై పట్టణ ఎస్‌హెచ్‌వో నరహరిని వివరణ కోరగా జరిగిన సంఘటనలపై కేసు నమోదు చేసుకున్నామని విచారణ కొనసాగుతుందని పూర్తి వివరాలు శనివారం వెల్లడిస్తామని తెలిపారు.

తగాదాలో గాజుముక్కతో దాడి

● సీఐ నరహరి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం అర్ధరాత్రి శాస్త్రి ఆదర్శ సంఘం వద్ద దాండియా ఆడిన పంపరి కేతన్ అతని స్నేహితుడు బృంధన్ పక్కనే మూత్రవిసర్జనకు వెళ్లగా ప్రణయ్, వరుణ్, శణ్ముఖంలు వారితో తగాదా పడ్డారని పట్టణ సీఐ నరహరి తెలిపారు. తగాదాపడిన కేతన్, బృంధన్‌లు అక్కడి నుంచి వెళ్లిపోయి కేతన్ అన్న ప్రఫూల్‌కు ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపారు. ప్రఫూల్ అక్కడికి వచ్చి ముగ్గురు వ్యక్తులతో మాట్లాడే ప్రయత్నం చేయగా వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ గొడవ తెలిసిన సిద్ధార్థ్ అనే యువకుడు అక్కడే ఉన్న గాజు ముక్క తీసుకుని ప్రఫూల్ అతని స్నేహితులైన రాహుల్, మణికంఠ, మణిరాజ్‌లను గాజుముక్కతో వీపు భాగం, కడుపు భాగంలో పొడిచారు. ప్రఫూల్, ఇతర కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో వివరించారు.

బెల్టు షాపులపై పోలీసుల దాడి

లింగంపేట, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ కారణంగా మండలంలోని సజ్జన్‌పల్లి గేట్, పర్మల్ల, ఎక్కపల్లితండా, నల్లమడుగు గ్రామాలలో శుక్రవారం పోలీసులు బెల్టు షాపులపై దాడి చేసి మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. సజ్జన్‌పల్లి గేట్ సమీపంలో మద్యం విక్రయిస్తున్న కృష్ణమూర్తి గౌడ్ వద్ద నుంచి రూ.2340 మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పర్మ గ్రామానికి చెందిన నాందేవ్ వద్ద నుంచి రూ.21970 విలువైన మద్యం సీజ్ చేశారు. ఎక్కపల్లితండాలో మాలోత్ రాము వద్ద రూ.12,500విలువైన మద్యం, మాలోత్ ప్రేమ్ వద్ద రూ.4640 విలువైన మద్యం బాటిళ్లను .జప్తు చేసుకున్నారు. నల్లమడుగులో అంజనేయులు వద్ద రూ.13,650 విలువైన మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలియజేశారు.


అర్గుల్‌లో రావణ దహనం నిర్వహిస్తున్న దృశ్యం


కొత్తపల్లిలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం


వేల్పూర్‌లో దసరా వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి


విజయదశమి వేడుకల్లో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఘనంగా విజయదశమి


కోటగిరిలో రావణ దహనం

జిల్లావ్యాప్తంగా విజయదశమి, దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాలలో గురువారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమ తమ వాహనాలకు పూజలు చేశారు. అలాగే రావణ సంహార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా.. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆర్మూర్ జంబి హనుమాన్ ఆలయ ప్రాంగణంలో ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేల్పూర్‌లో జరిగిన దసరా సంబరాలలో బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. గ్రామస్థులతో కలిసి జంబి పూజలో పాల్గొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**


మెండోరలో శమీ చెట్టుకు పూజలు చేస్తున్న దృశ్యం


శక్కర్‌నగర్‌లో రావణ దహనం


బినోలలో జమ్మి చెట్టుకు పూజలు


భీమ్‌గల్‌లో వేడుకకు తరలివచ్చిన జనం


ఎడపల్లిలో పూజలు చేస్తున్న గ్రామస్థులు


రెంజల్‌లో జమ్మిచెట్టుకు పూజచేస్తున్న దృశ్యం


మోర్తాడ్‌లో రావణ సంహారం

వరదలతో దెబ్బతిన్న వరి


కోస్లీ శివారులో దెబ్బతిన్న వరిపొలం

నవీపేట,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో గోదావరి పరివాహక ప్రాంతంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గోదావరి నదికి పలుమార్లు వరదలు రావడంతో మండలంలోని కోస్లీ, మిట్టాపూర్, యంచ, అల్జాపూర్, నందిగామ, బినోల, నాళేశ్వర్ గ్రామాలలో పంటలు నీటమునిగాయి. చేతికొచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లాభాల సంగతి అటుంచితే పెట్టుబడి కూడా వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పరిహారం చెల్లిస్తేనే తమకు న్యాయం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. మండలంలో సుమారు 1800 ఎకరాలలో వరి పంటనష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొన్నారు. దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. ప్రతి సంవత్సరం పంట నష్టం జరిగినప్పుడు అధికారులు వచ్చి సర్వే చేస్తున్నారు.. గానీ పరిహారం రావడం లేదని పేర్కొంటున్నారు. ఈసారైనా తమకు న్యాయం జరిగేలా చూడాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి

ఆర్మూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి అందరూ తోడ్పాటు అందించాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో శుక్రవారం అలాయ్ బలాయ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు పాల్గొన్నారు. యువత ఉద్యోగరీత్యా ఎక్కడున్నా సొంత ఊరిపై మమకారం చూపాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందరూ ఐకమత్యంతో కలిసి మెలసి ఉండి గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. విద్యనేర్పిన ఉపాధ్యాయులను నాయకులు సన్మానించారు. కార్యక్ర మంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి,


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి తదితరులు

రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు మార చంద్రమోహన్, మాజీ సర్పంచ్ కిశోర్‌రెడ్డి, మాజీఎంపీటీసీలు గంగారెడ్డి, మహేందర్, వీడీసీ అధ్యక్షుడు గంగారెడ్డి, గ్రామస్థులు ఉన్నారు.

మారతాన్‌లో వేల్పూర్ వాసికి మెడల్

● 15 వేల మంది రన్నర్లు పాల్గొన్న కాంపిటీషన్‌లో ప్రతిభ

వేల్పూర్, అక్టోబర్ 3, (ఆంధ్రజ్యోతి): ఏపీ విజయవాడలోని అమరావతిలో స్వచ్ఛతాన్ వారి ఆధ్వర్యంలో దసరా రోజు జరిగిన ఆఫ్ మారథాన్‌లో ఫినిషర్ మెడల్‌ను వేల్పూర్‌కు చెందిన గుగ్గిలం అశోక్ సాధించారు. ఆంధ్ర స్వచ్ఛతాన్ కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్, కొమ్మరెడ్డి మోడల్‌తో అశోక్‌ను సన్మానించారు. ఈ మారతాన్‌లో అన్ని రాష్ట్రాల నుంచి 15,000 మంది రన్నర్‌లు పాల్గొన్నారు.

హమాలీ భవన్‌కు స్థలం కేటాయించాలి


మాట్లాడుతున్న నాయకులు

రుద్రూరు,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రంలో హమాలీ కార్మికుల కోసం హమాలీ భవన్‌కు స్థలం కేటాయించాలని హమాలీ యూనియన్ రుద్రూర్ మండల కన్వీనర్ బందేల భీమయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రుద్రూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 50ఏళ్లు నిండిన హమాలీ కార్మికులకు నెలకు 5వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని కోరారు. లేకపోతే హమాలీ కార్మికులను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హమాలీ యూనియన్ నాయకులు మహబూబ్, గంగాధర్, ఎర్రన్న, లక్ష్మణ్, భూమయ్య, రాములు, గంగారాం, పీరయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటా.. ధైర్యంగా ఉండు


పాలెపు నర్సయ్యను పరామర్శిస్తున్న టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్

కమ్మర్‌పల్లి,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్యను గురువా రం సాయంత్రం రాష్ట ఖనిజాభివృద్ధి శాఖ చైర్మన్ ఈరవత్రి అనిల్ పరామర్శించారు. పాలెపు నర్సయ్యకు వారం క్రితం గుండె సంబంధిత శస్త్రచికిత్స జరగడంతో అనిల్ పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈరవత్రి అనిల్ వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, జిల్లా కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్, నాయకులు అబ్దుల్ రఫీ, గణేష్ గుప్త తదితరులు ఉన్నారు.

ప్రశాంత్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు3: (ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. వేల్పూర్‌లోని ఆయన స్వగృహంలో కలిసిన వారిలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, కమ్మర్‌పల్లి సహకార సంఘం చైర్మన్ రేగుంట దేవేందర్, మాజీ ఎంపీటీసీలు ఫైలారం సుధాకర్, పిప్పెర


బాల్కొండ ఎమ్మెల్యేతో గులాబీ శ్రేణులు

అనీల్, నాయకులు బద్రి, నరేందర్, శ్రీనివాస్, నరేష్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

బీజేపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి

జక్రాన్‌పల్లి , అక్టోబరు, 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీజేపీ జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పిలుపునిచ్చారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో బీజేపీ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జడ్పీ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంటుందని, అలాగే గ్రామాలలో అధిక సీట్లను బీజేపీ గెలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికలపై బీజేపీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ప్రధాని మోదీ నాయకత్వం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీజేపీని గెలిపిస్తుందన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ నాయకత్వంలో జిల్లాలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని బీజేపీ అభివృదిని చూసి ప్రజలు స్థానిక ఎన్నికల్లో పట్టం కడతారని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరు పతిరెడ్డి, మండల అధ్యక్షుడు క్యాతం రాజారెడ్డి, మాజీ ఎంపీపీ అనంత్‌రెడ్డి,


మాట్లాడుతున్న బీజేపీ జిల్లాధ్యక్షుడు దినేష్

బీజేపీ నాయకులు లోలం జగదీష్, శ్రీనివాస్, బొజ్జ సంజీవ్, మహేందర్, విక్రం తదితరులు పాల్గొన్నారు

స్థానిక సంస్థలు కైవసం చేసుకుంటాం


హనుమాన్ ఫారంలో బీఆర్‌ఎస్ సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

నవీపేట,అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో జడ్పీటీసీ స్థానంతో పాటు మండలంలోని 16 ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటామని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగ రావు అన్నారు. శుక్రవారం మండలంలోని హనుమాన్ ఫారంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడే ప్రభుత్వ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల చెందిన బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.


గాంధీనగర్‌లో నివాళులు అర్పిస్తున్న నాయకులు


బోధన్ గాంధీ పార్కులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గాంధీజీ అడుగుజాడల్లో నడవాలి

ప్రతీఒక్కరు గాంధీజీ అడుగు జాడల్లో నడవాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. గురువారం మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని గాంధీపార్కుతో పాటు గంజ్ లో రోడ్డు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎల్‌బీఎస్ నగర్‌లో గల లాల్ బహదూర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ దేశ స్వాతంత్ర సాధన కోసం గాంధీజీ శాంతియుత పోరాటం చేశారని గుర్తు చేశారు. నేటి యువత ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, డీఈ యోగేష్, ఏఈ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**


ఆర్మూర్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు


పెర్కిట్‌లో పూలమాల వేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు


కోటగిరిలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం


నవీపేటలో నివాళులర్పిస్తున్న దృశ్యం


నవీపేటలో దుర్గామాత


నవీపేట: డోలు వాయిస్తున్న కళాకారులు


బోధన్‌లో అమ్మవారు


బాల్కొండలో దుర్గామాత

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

జిల్లావ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఆయా మండలాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవీ ప్రతిమలను ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి శోభాయాత్రలు నిర్వహించారు. స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు. బోధన్ ఏకచక్రేశ్వర శివాలయంలో శుక్రవారం అమ్మవారి శోభాయాత్ర ఘనంగా కొనసాగింది. సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సార్వజనిక్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారి శోభాయాత్రను ప్రారంభించారు. పట్టణంలోని పలు వీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది. పెగడాపల్లి వాగులో అమ్మవారిని నిమజ్జనం చేశారని పండితుడు గణేష్ మహరాజ్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకట నారాయణ, తహసీల్దార్ విఠల్, మాజీ కౌన్సిలర్లు దాము, శరత్ రెడ్డి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**


శోభాయాత్రలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్


ఆర్మూర్‌లో నృత్యాలు చేస్తున్న దృశ్యం


కమ్మర్‌పల్లిలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాయితీపై వ్యవసాయ పరికరాలు

● రైతులకు మరింత ప్రయోజనం

● మందకొడిగా దరఖాస్తులు

ఆర్మూర్, అక్టోబర్ 3 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేసేందుకు ప్రభుత్వం రైతుల నుంచి దరఖాస్తులను తీసుకొంటుంది. గత కొన్ని నెలలుగా రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు, ఉపకరణాలు, యంత్రాలు రాయితీపై సరఫరా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఆలస్యం అయినప్పటికీ వ్యవసాయ పరికరాల అందజేతకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గత ప్రభుత్వ పాలనలో ఆరేళ్ళ పాటు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారు. వ్యవసాయ యంత్రీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై కల్టివేటర్‌లు, నాగళ్లు, రోటోవేటర్‌లు, బ్యాటరి స్ప్రేయర్‌లు, పవర్ స్ప్రేయర్లు, బ్రష్ కటర్లు, పవర్ వీడర్‌లు, మొక్కజొన్న ఒలిచే యంత్రాలు, పాటు ఇతర పరికరాలను అంద జేయనున్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

ప్రభుత్వం అందజేస్తున్న వ్యవసాయ పనిముట్లు ఎస్సీ, ఎస్టీలకు 50శాతం సబ్సిడీపై, జనరల్ ,బీసీ రైతులకు 40శాతం సబ్సిడీపై అంద జేయనున్నారు. లక్ష రూపాయల కంటే ఎక్కువ విలువ కలిగిన పరికరాలకు కనీసం రైతు ఎకరం భూమి కలిగి ఉండాలి. ధరఖాస్తు చేసుకునే రైతు పేరిట భూమి కలిగి ఉండాలి. పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జి రాక్స్, డీడీ, రెండు ఫోటోలతో పాటు రైతులు తీసుకొనే వ్యవసాయ పరికరాలకు సంబందించిన కొటేషన్‌ను జతచేసి గ్రామంలోని రైతు వేదికల వద్ద ఏఈవోలకు ధరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం ముందుగా మహిళా రైతులకే వ్యవసాయ పరికరాలు అందజేస్తామని చెప్పినప్పటికి ని బంధనలు మార్చి మహిళలతో పాటు పురుషలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు.

గత ప్రభుత్వంలో అటకెక్కిన పథకం..

అన్ని రంగాలలో మార్పులు వచ్చిన విధంగానే వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. వ్యవసాయంలో రైతులకు సబ్సిడీపై గతంలో అనేక పరికరాలు, యంత్రాలు అందజేసేవారు. దీంతో రైతులు ఎంతో సంతోషించారు. ఆ సంతోషం కాస్త మూన్నాళ్ల ముచ్చటే అయింది. ఆధునిక వ్యవసాయంలో యంత్రాల ప్రవేశంతో వ్యవసాయ రంగానికి మంచి రోజులు వచ్చాయని రైతులు మురిసిపోయారు. కానీ కొన్నేళ్లుగా ప్రభుత్వం సబ్సిడీపై ఎలాంటి యంత్రాలు, పరికరాలు అందజేయడం లేదు. 2018 మార్చి నుంచి రాయితీపై వ్యవసాయ పరికరాలు రైతులకు అంద లేదు.



పవర్ స్ప్రేయర్

మందకోడిగా దరఖాస్తులు

వ్యవసాయ పరికరాలను రాయితీ పై పొందడానికి రైతులు దరఖాస్తు చేసు కోవడంలో జాప్యం చేస్తున్నారు. బాల్కొండ నియో జక వర్గంలోని మండలాల్లో ఇప్పటి వరకు 102 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. 1300 బ్యార్టి స్ప్రేయర్‌లు, 150 పవర్ స్ప్రేయర్‌లు, 75 కల్టి వేటర్‌లు, 60 రోటో వెటర్లు, 10 పవర్‌వీడర్లు, 5 బ్రష్ కటర్‌లు భీమ్‌గల్ ఏడీఏ పరిధిలోని గ్రామాలకు మంజూరయ్యాయి. అక్టోబర్ 31 వరకు గడువు ఉన్నప్పటికి



పిచికారి చేస్తున్న రైతు

ధరఖాస్తులు మందకోడిగానే వస్తున్నాయి. ఇందుకు కారణం ఆన్‌లైన్ ఓపెన్ కాకపోవడంతో ధరఖాస్తులు తక్కువ వస్తున్నాయని తెలిసింది. ఆన్‌లైన్ పోర్టల్ ఓపెన్ అయితే వచ్చే నెల ఆఖరు వరకు మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం నియోజకవర్గాల వారీగా నిధులను మంజూరు చేసింది. అవి కూడా పూర్తిస్థాయిలో మంజూరు కాలేదు. మరిన్ని నిధులు రావాల్సి ఉంది.

రైతులకు పెట్టుబడి ఆదాకు అవకాశం

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందజేస్తే రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి డబ్బులు ఆదా అవుతాయి. రోటో వేటర్ లాంటి పరికరాల వినియోగంతో భూమి గుల్లాగా మారి సారవంతమవుతుంది. పిచికారి పరికరాలు (స్ప్రే) పంపులు రాయితీ ఇవ్వడం వల్ల రైతులకు లాభం చేకూరుతుంది. సీడ్‌కం ఫర్టిలైజర్, డ్రీల్ వినియోగం ద్వారా విత్తన మోతాదు, ఎరువులు మోతాదు ఆదా అయి రైతులకు బహువిధ లాభాలు చేకూ రుతాయి. దీనివల్ల వ్యవసాయ పెట్టుబడి ఖర్చు తగ్గించి రైతులకు నికర ఆదాయం పెంచడానికి వీలు కలుగుతుంది.



బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

నేడు ఎడపల్లిలో బతుకమ్మ పండుగ

ఎడపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రమంతటా ఆడపడుచులు దసరా ముందు బతుకమ్మ పండుగను నిర్వహించుకుంటారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో మాత్రం ఇందుకు భిన్నంగా దసరా తరువాత ఐదు రోజులకు బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు. దసరా తరువాత బతుకమ్మ పండుగను నిర్వహించడానికి గల కారణాలను గ్రామంలో ఉన్న పెద్దలను అడగగా భిన్న కథనాలు తె లిపారు. ఎడపల్లి మండల కేంద్రంలో కూడా పూర్వికులు దసరా ముందే బతుకమ్మ పండుగను జరుపుకునే వారని ఒకసారి జరిగిన అనుకోని సంఘటనతో దసరా తరువాత బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని తెలిపారు. ఇలా బతుకమ్మ పండుగ చేసుకునే సమయంలో అప్పట్లో గ్రామాన్ని పాలించే దేశ్‌ముఖ్‌ల పాలనలో గ్రామంలో తొలి బతుకమ్మ దేశ్‌ముఖ్ గడిలో నిర్వహించే వారని, బతుకమ్మ పండుగను దేశ్‌ముఖ్‌ల సిపాయి తుపాకి పేల్చి ప్రారంబించడం ఆనవాయితీగా ఉండేదని, అలా ఒకసారి తుపాకి పేల్చే క్రమంలో తుపాకీ అదుపుతప్పి సిపాయికి తగిలి మరణించడంతో ఇది గ్రామానికి అ రిష్టంగా భావించిన దేశ్‌ముఖ్‌లు దసరా తరువాత బతుకమ్మ పండుగ ను నిర్వహించాలని గ్రామస్థులకు చెప్పడంతో అప్పటి నుండి దసరా త రువాత బతుకమ్మ పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని గ్రామ పెద్దలు తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు దసరా తరువాత బతుకమ్మ పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మరికొందరేమో దస రా ముందు అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగ జరుపుకోవడంతో పు ట్టింటి అడపడుచులు, అత్తింటి కోడళ్ళు కలిసి బతకుమ్మ పండుగ జరుపుకోవడానికి వీలుండదని భావించిన గ్రామ పెద్దలు అత్తింటి కోడళ్ళు, పుట్టింటి ఆడపడుచులు కలిసి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో దసరా తరువాత బతుకమ్మ పండుగను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మలను ఆటపాటలతో ఆడిపాడిన అనంతరం గ్రామ శివారులో ఉన్న బిక్కుంట (బతుకమ్మ) చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేసి తమ వెంట తీసుకు వచ్చిన ఫలహారాన్ని అందరికీ పంచి అక్కడే భుజించి తమ తమ ఇంటికి తిరిగి వస్తారు.

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం

బీర్కూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీవారి కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. పలు జంటలు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని కల్యాణం జరిపించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య శ్రీవారి కళ్యాణం జరిగింది. కల్యాణ ఘట్టాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించారు. స్వామి వారికి పల్లకిసేవ నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ సన్నిధిలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావ్, నరసరాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు రహదారి నియమాలపై అవగాహన

బీర్కూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలని ఎస్ఐ మహేందర్ వాహనదారులకు సూచించారు. శుక్రవారం బీర్కూర్ మండలకేంద్రంలోని స్థానిక ప్రజలకు రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు రోడ్డు ప్రమాదాల నివారణకు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, వాహన పత్రాలతో పాటు, సంబందిత వాహనదారులు లైసెన్స్‌లు కలిగి ఉండాలని సూచించారు. దీంతో పాటుగానే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు అధికమవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయవద్దని సూచించారు. దీంతో పాటుగానే ఓటిపిలను ఎవరికి షేర్ చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బీర్కూర్‌లో గాంధీ జయంతి వేడుకలు

బీర్కూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. బీర్కూర్ మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, బస్వరాజ్ పటేల్, యామ రాములు, కాంత్ రెడ్డి, రఘు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఘనంగా దసరా వేడుకలు

బీర్కూర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాలలో ప్రజలు విజయదశమి వేడులకు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రజలు ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి సాయంత్రం సమయంలో పాల పిట్టను చూసి శమి వృక్షానికి పూజలు చేసేందుకు ఆనందోత్సాహాల నడుమ బయలు దేరారు. శమి వృక్షంకు పూజలు చేసిన అనంతరం ఆ ఆకులను బంధుమిత్రులకు బంగారం ఇస్తూ అలయ్‌బలయ్ నిర్వహించుకున్నారు.

ఘనంగా ఆర్యసమాజ్ దసరా ఊరేగింపు



ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ధ్వజ ఊరేగింపు



ధ్వజానికి పూజలు చేస్తున్న ఆర్యసమాజ్ ప్రతినిధులు

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి):దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ధ్వజా ఊరేగింపు ఘనంగా సాగింది. గురువారం జిల్లా కేంద్రంలోని కసాబ్‌గల్లిలో గల ఆర్యసమాజ్‌లో ధ్వజానికి ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించి వినాయక్‌నగర్ వరకు ఊరేగింపు నిర్వహించారు. వినాయక్‌నగర్ వద్ద నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా దేవిదాస్, విఠల్‌రావులు మాట్లాడుతూ దసరా వేడుకలు ప్రజలంతా ఆనందోత్సహాలతో జరుపుకోవాలని అన్నారు. నాటి రామాయణ కాలంలో రావణాసుడిని రాముడు వధించి ధర్మసంస్థాపన చేసినందుకు వేడుకలను నిర్వహించుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

వన దుర్గామాత ఆధ్వర్యంలో పూజలు

సుభాష్‌నగర్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని వనదుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ప్రతిష్ఠించిన శమీ వృక్షానికి ఆలయ కమిటీ ప్రతినిధులు పూజలు నిర్వహించి అమ్మవారికి శమీ పత్రాలను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా వనదుర్గా కమిటీ చైర్మన్ అలుక కిషన్ మాట్లాడుతూ అమ్మ అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చిట్టి నారాయణరెడ్డి, ఆకుల ప్రసాద్, దేవిసింగ్, సాయిబసవ, తదితరులు పాల్గొన్నారు



షమీ వృక్షానికి పూజలు చేస్తున్న దృశ్యం

6న జిల్లాకేంద్రంలో కార్మికుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి దాసు

జక్రాన్‌పల్లి, అక్టోబరు, 3 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ స్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరి ష్కరించాలని డిమాండ్ చేస్తు జిల్లా కేంద్రంలో ఈ నెల 6న ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. శుక్రవారం జక్రాన్‌పల్లిలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో జరిగే ధర్నాకు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సొప్పరి గంగాధర్, బాలయ్య, భాను చందర్, రాజన్న, సాయిలు, మోహన్ గణేష్, కార్మికులు పాల్గొన్నారు.

ఫరీద్‌పేటలో కోడ్ రగడ

● ఎన్నికల కోడ్‌తో ఆగిన గ్రంథాలయ ప్రారంభోత్సవం

పాల్వంచ, అక్టోబరు 3: పాల్వంచ మం డలం ఫరీద్‌పేట్‌లో దాత నిర్మించిన గ్రం థాలయ ప్రారంభోత్సవం స్థానిక ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడింది. ఫరిద్‌పేట్ గ్రా మానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి తన తండ్రి మ హబూబ్‌రెడ్డి, కూతురు హారిక జ్ఞాపకార్థం సుమారు రూ.20లక్షలతో సొంత నిధులతో అన్నిహంగులతో ఈ గ్రం థాలయాన్ని నిర్మించారు. అన్నిహంగులతో నిర్మించిన ఈ గ్రంథాలయాన్ని దసరా సందర్భంగా ప్రారంభించేందుకు అన్నిఏర్పాట్లు పూర్తి చేశారు. ఒకే పార్టీలో ఉన్న స్థానిక నేత మధ్య అంతర్గత కలహాలతోనే ఈ కార్యక్రమం నిలిచిపోయిందని కొందరు, గ్రంథాలయ నిర్మాణం పూర్తి అయి చాలా రోజులు గడిచిందని ఎన్నికల కోడ్ ఉన్నందున ఎలాగైనా ప్రారంభోత్సవం ఆపుతారని తెలిసి కూడా మమ్మల్ని రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికే ఇలా చేశారని మరో వర్గం వాదన. గ్రంథాలయాన్ని గ్రామానికి అంకితం చేసి నిరుద్యోగులకు ఉపయోగపడేలా ఉన్న ఈ కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూడవద్దని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధం చేసిన గ్రంథాలయం

ఉత్తమ విద్యార్థికి అభినందనలు

ముప్కాల్ , అక్టోబరు, 3(ఆంధ్రజ్యోతి): గాంధీ జ్ఞాన ప్రతిష్టన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ ఆన్‌లైన్ పరీక్షలో ముప్కాల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి ఎం.నితిన్, ఎండీ రహనోద్దీన్ ప్రథమ స్థానంలో వరించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంగారాం శుక్రవారం తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ ప్రతిభ పాటవ ప్రథమ స్థానం వరించిన విద్యార్థులకు మెమోంటో, సర్టిఫికెట్, రూ.500 నగదుతో సత్కరించి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు తర్ఫీదును ఇచ్చిన సుద్దపల్లి మల్లేష్ విద్యార్థులను అభినందించారు.



మెమోరాండం అందుకుంటున్న విద్యార్థి

క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరి

● బజార్‌హత్నూర్ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

బజార్‌హత్నూర్ అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది ప్రతీఒక్కరు క్రమశిక్షణతో పాటు సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా కృసి చేయాలని, కేసులో దర్యాప్తు, నేర పరిశోధనపై పురోగతి సాధించి నాణ్యమైన దర్యాప్తుతో బాధితులకు న్యాయం చేసేలా వేదికలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఎప్పటికప్పు డు నవీకరిస్తూ ఉండాలన్నారు. వాహనాలను పరిశీలించి కేసుల వివరాలు తెలుసుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్‌క్రైమ్, డిజిటల్ ఫ్రాడ్, గంజాయి, మాధకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, బోథ్ సీఐ వెంకటేశ్వర రావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.



బజార్‌హత్నూర్ పీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

శాస్త్రోక్తంగా భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఆలయ కార్యనిర్వాహణ అధికారి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నీలకంఠేశ్వర ఆలయంలో నూతనంగా నిర్మించతలపెట్టిన హాల్ నిర్మాణానికి గురువారం శా స్త్రోక్తంగా భూమి పూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కార్యనిర్వాహ ణ అధికారి శ్రీరాం రవీందర్ గుప్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహకారం తో ఆలయ ప్రాంగణంలో హాల్ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుహాల్ శాఖాయ్, మకరంద్ శాఖా య్, నీలేశ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగించిన వ్యక్తిపై కేసు

● రోడ్లపై పుట్టినరోజు వేడుకలు నిషేధం : ఆదిలాబాద్ డీఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గత నెల 19వ తేదీన న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలో అనుమతులు లేకుండా షెల్కే అజయ్ అలియాస్ మహాకల్ అజయ్ అనే వ్యక్తి అనుమతులు లేకుండా రోడ్డుపై పుట్టినరోజు వేడుకలు నిర్వహించిన కారణంగా అతనిపై, అతని అనుచరులపై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. గతనెల 19వ తేదీన అనుమతులు లేకుండా రోడ్డుపై అతని పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారని, పబ్లిక్ న్యూసెన్స్ రోడ్డును అడ్డుకోవడం, అనుమతులు లేకుండా టపాసులు కాల్చడం, అరుపులు శబ్దాలతో చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు కలిగించిన కారణంగా ఈ ఘటనపై మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. ప్రజా ప్రదేశాలలో అనుమతులు లేకుండా పుట్టినరోజు వేడుకలు చేయడం, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం లాంటివి చట్ట విరుద్ధమని తెలిపారు. ఒకరి పుట్టినరోజు వేడుకలు ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ఉండాలని తమ ఇంటి వద్ద వేడుకలను నిర్వహించుకుంటే మంచిదని తెలియజేశారు. మహాకాళి గ్రూప్, టైగర్ గ్రూప్, ఈగల్ గ్రూప్, యువశక్తి గ్రూప్ అంటూ కొందరు తమ గ్రూపు అధ్యక్షుల పుట్టినరోజు వేడుకలను రోడ్లపై నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున వాటి ఉల్లంఘనలకు, రోడ్డుపై ఉన్న వాహనదారులకు ఇబ్బందులు కలిగించడం, చట్ట ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించా రు. పబ్లిక్ స్థలాలలో పుట్టినరోజు వేడుకలలో టపాసులు కాల్చడానికి అనుమతులు లేవన్నారు. ముఖ్యంగా ఫైర్ క్రాకర్స్, కోల్డ్ ఫైర్ క్రాకర్స్ అంటూ టపాసు లు కాల్చిన వారిపై, పేపర్‌లు చల్లడం, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీయిజంపై,గ్యాంగ్ స్టర్లపై, భూమాఫియా దార్లపై, గంజాయిపై ఉక్కు పాదం మోపుతున్నామని, ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి సమాచారం ఉన్న జిల్లా పోలీస్ యంత్రాంగానికి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మావల సీఐ కర్ర స్వామి, ఎస్సైలు ఎల్ ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

సత్ప్రవర్తనతో మెలగాలి



ఖైదీలకు పండ్లు పంపిణీ చేస్తున్న మెజిస్ట్రేట్ చంద్రశేఖర్

కామారెడ్డిటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో మెదగాలని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా సబ్ జైలులో ఖైదీలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గంలో నడుస్తూ జైలులో ఉన్నందుకు బాధపడకుండా జైలు జీవితం తర్వాత ఉన్నతంగా గడపాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్‌రావు, జైలు సూపరింటెండెంట్ సంజీవ్‌రెడ్డి, ఆఫీస్ అసిస్టెంట్ ఉదయజ్ఞాని, సాయికృష్ణ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్, అక్టోబరు 03: మండలంలోని ధర్మారావుపేట్ గణేష్ యూత్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఏనుగు భరత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సామల రంజిత్‌రెడ్డి, కార్యదర్శిగా సామల సునీల్‌రెడ్డి, కోశాధికారిగా కొండ ప్రశాంత్‌రెడ్డిని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



రాజంపేటలో జెండాను ఎత్తుతున్న గ్రామస్తులు



లింగంపేటలో నూతన జెండాను ఏర్పాటు చేస్తున్న దృశ్యం



భిక్కనూరు మండలం కంచర్లలో జెండా ఎగురవేస్తున్న దృశ్యం

ఘనంగా దసరా పండుగ

జిల్లావ్యాప్తంగా విజయదశమి, దసరా పండుగను ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాలలో గురువారం ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అనంతరం ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమ తమ వాహనాలకు పూజలు చేశారు. అలాగే రావణ సంహార కార్యక్రమాలు ఘనంగా నిర్వహించగా.. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రామస్తులతో కలిసి జంబి పూజలో పాల్గొని దసరా శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాజంపేటలోని కషీర్ వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామస్తులు సుఖసంతోషాలతో, పాడిపంటలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. భిక్కనూరు సిద్ధరామేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో విజయదశమి పండుగను పురస్కరించుకుని గ్రామస్తులు గురువారం చత్రపతి శివాజీ విగ్రహం వద్ద కాషాయపు జెండా ఎగురవేసి ఆయుధ పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచారెడ్డి మాజీ ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు విజయదశమిని పురస్కరించుకుని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీని గురువారం కలిసి పండుగ శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



దసరా సందర్భంగా షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న నర్సింగ్‌రావు



జనగామలోని దుర్గమాత మండపం వద్ద మాలధారులు



బాన్సువాడ రూరల్: కాషాయపు జెండా ఎగురవేస్తున్న ప్రజలు

అశోక విజయదశమి వేడుకలు



కామారెడ్డిలో విజయదశమి ఉత్సవాలు జరుపుకుంటున్న నాయకులు

కామారెడ్డిటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం అంబేద్కర్ యువజన సంఘం, బామ్‌సేఫ్, భారత్ ముక్తి మోర్చా ఆధ్వర్యంలో అశోక విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అశోకచక్రవర్తి, బీఆర్ అంబేద్కర్ ఫోటోలకు పూలమాలలు వేసి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. క్రీస్తు పూర్వం 261 సంవత్సరంలో సామ్రాట్ అశోక చక్రవర్తి కళింగ యుద్ధం తర్వాత అక్కడ జరిగిన మరణహోమాన్ని గ్రహించి బౌద్ధమత గురువు ఉపగుప్తుని సలహామేరకు బౌద్ధమతాన్ని స్వీకరించాడన్నారు. శాంతి, సత్యం, హింససమత, న్యాయత,బంధుత అనే అంశాల వైపు వెళ్లాలని నిర్ణయించు కుని చెడు అలవాట్లను వదిలేశాడని తెలిపారు. తన రాజ్యంలో ప్రజలందరికి పిలుపునిచ్చి చెడును జయించి మంచిని పొందుతున్న రోజు కాబట్టి విజయదశమిగా నిర్వహించాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో నరేందర్, బాబు, సిద్దిరాములు, గంగారాం, మల్లయ్య, గౌతమ్,ఏసురత్నం, శంకర్,అశోక్, హజీ, పత్రిజీ, రామకృష్ణ,కిరణ్, ప్రదీప్, రాజు, బాలయ్య, సిద్దిరాములు, సత్యం పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో సత్తా చాటాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులును సన్మానిస్తున్న నాయకులు

భిక్కనూరు, అక్టోబరు 03: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అధిక స్థానాలు సాధించేలా ప్రతిగ్రామంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగి సత్తా చాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు అన్నారు. శుక్రవారం భిక్కనూరు మండలంలోని జంగంపల్లి బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపి స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. ఎన్నికలు ఎప్పుడొచ్చిన సిద్ధంగా ఉండాలని, మండలంలో మెజార్టీ సీట్లు సాధించాలని ఆయన నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు కుమ్మరి నరేందర్, నాయకులు మీసాల ప్రవీణ్‌గౌడ్, నీట చంద్రం, హరి, రాముల, ప్రకాష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఈకేవైసీ చేసుకోవాలి



గొట్టిముక్కులలో ఈకేవైసీ ఫొటో తీస్తున్న ఎఫ్ఏ

దోమకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంనకు సంబంధించిన కార్డు కలిగిన ప్రతీఒక్కరు ఈకేవైసీ చేసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ అంజాగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొట్టిముక్కుల గ్రామంలోని జీపీ వద్ద ఈకేవైసీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 70 మందికి ఈకేవైసీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాంచంద్రం, శేఖర్, సీఏ రాజు ఉన్నారు.

సొంతగూటికి బీఆర్ఎస్ నేతలు

భిక్కనూరు, అక్టోబరు 03: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కేతి మధు ఇటీవల కాంగ్రెస్‌లో చేరగా తిరిగి శుక్రవారం బీఆర్ఎస్ గూటికి చేరుకున్నారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో విండో చైర్మన్ భూంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ యాదగిరి, మాజీ సర్పంచ్ పోతిరెడ్డి, తునికి వేణు, మాజీ ఎంపీటీసీ సాయిరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, స్వామి, తదితరులు పాల్గొన్నారు.



మధుకు పార్టీ కండువా వేస్తున్న నేతలు



సదాశివనగర్‌లో దుర్గామాతకు పూజలు చేస్తున్న మండపాల నిర్వాహకులు



గుడిమేట్‌లో అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్థులు

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర

జిల్లావ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఆయా మండలాల్లో ఏర్పాటుచేసిన దుర్గాదేవీ ప్రతిమలను ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి శోభాయాత్రలు నిర్వహించారు. స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. లింగంపేటలో పెద్దమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారి లడ్డును మండల కేంద్రానికి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు క్రాంతికుమార్ రూ.16100కు వేలంలో గెలుచుకున్నారు. బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ అమ్మవారి చేతిలోని లడ్డూను బైరి గంగారాం రూ.58వేలకు దక్కించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఇబ్రహీంపేట్‌లో అమ్మవారి శోభాయాత్ర



లింగంపేటలో శోభాయాత్ర



లింగంపేటలో అమ్మవారి లడ్డుతో క్రాంతికుమార్

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 03,(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి-బాన్సువాడ ప్రధాన రోడ్డుపై అన్నాసాగర్ గ్రామ శివారులో శుక్రవారం ఎల్లారెడ్డి ఏఎస్సై గంగారెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో బాగంగా పెండింగ్‌లో ఉన్న చలాన్లు, వాహనాలకు సంబంధించిన పత్రాలు, లైసెన్స్‌లు పరిశీలించి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది స్వామిగౌడ్, అమర్, సంతోష్, అర్చన, సిద్ధూ, తదితరులు

భిక్కనూరు రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నిక



ఎన్నికైన నూతన పాలకవర్గ సభ్యులు

భిక్కనూరు, అక్టోబరు 03 (ఆంధ్రజ్యోతి):: మండల రెడ్డి సంక్షమ సంఘాన్ని శుక్రవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నాగన్నగారి నరేందర్‌రెడ్డి, నూతన అధ్యక్షులుగా కుంట లింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా పెంజర్ల సతీష్‌రెడ్డి, మోకాళ్ల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మద్ది కృష్ణారెడ్డి, కోశాధికారిగా బారెముల బాపురెడ్డి, సహాయ కార్యదర్శిగా ముచ్చర్ల శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కందడి రమేష్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

ప్రయాస్‌కు చిన్నమల్లారెడ్డి విద్యార్థినుల ప్రాజెక్ట్



గూగుల్‌మీట్‌లో ప్రాజెక్ట్ వివరాలు వెల్లడిస్తున్న పాఠశాల విద్యార్థిని

కామారెడ్డిటౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రయాస్‌కు చిన్నమల్లారెడ్డి ఉన్నత పాఠశాలకు చెందిన ప్రాజెక్ట్ ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు సాయిరెడ్డి, గైడ్ టీచర్ ప్రవీణ్ తెలిపారు. 9 వతరగతి విద్యార్థినులు రావుల నిహారిక, పోషబోయిన భవశ్రీ రూపొందించారని తెలిపారు. శుక్రవారం గూగుల్‌మీట్‌లో ప్రయస్ ఆన్‌లైన్‌లో విద్యార్థులు వివరించారు. శాస్త్రీయ ఆలోచన, సృజనాత్మకత, సమస్య పరిష్కార దృక్పథం పెంపొందించడం అలాగే శాస్త్రీయ వైఖరులు, విలువలు అలవరచడ లక్ష్యంగా ప్రయాస్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఫైనల్ రౌండ్స్‌కి ఎంపికైన ప్రాజెక్ట్‌కు కేంద్రప్రభుత్వంతో రూ.50 వేల ప్రోత్సాహక నిధి అందజేయబడుతుందని తెలిపారు.

చైల్డ్ కేర్ సంస్థ నుంచి బాలల అదృశ్యం

పాల్వంచ, అక్టోబరు 03(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ సంస్థ సంరక్షణలో ఉన్న ఇద్దరు బాలలు అదృశ్యమైన సంఘటన భవానీపేట్‌లో చోటుచేసుకుంది. ఎస్సై అనీల్ కథనం ప్రకారం.. పాల్వంచ మండలం భవానీపేట్ గ్రామశివారులో ఉన్న చైల్డ్ కేర్ సంస్థ నుంచి ఇద్దరు బాలలు అదృశ్యమైనట్లు తెలిపారు. అక్టోబరు 1న బుధవారం రాత్రి 8గంటల ప్రాంతంలో మహమ్మద్ రఫీ(13), కట్ట దేవదాస్(12) కలిగిన ఇద్దరు బాలలు కనిపించకుండా పోయిరని తెలిపారు. చైల్డ్ కేర్ సంస్థ పర్సనల్ ఇంచార్జి బుక్యా శోభన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పిల్లల ఆచూకి ఎవరికైనా తెలిస్తే 8712686151కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఫ్రెండ్స్ యూత్ కార్యవర్గం ఎన్నిక

పాల్వంచ, అక్టోబరు03: మండలకేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా చక్రవర్తి, ప్రధాన కార్యదర్శిగా అంజీ యాదవ్, కోశాధికారిగా మల్లేష్ ఎన్నికయ్యారు.



గాంధీవిగ్రహానికి నివాళులర్పిస్తున్న టీఎన్‌జీవోస్ నాయకులు



దోమకొండలో పూలమాల వేస్తున్న దృశ్యం



లింగంపేటలో నివాళులర్పిస్తున్న దృశ్యం

గాంధేయ మార్గంలో నడుచుకోవాలి

కావూరెడ్డి టౌన్,అక్టోబరు03(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో గాంధీ గంజ్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీ జీవితం మనకు అహింస, నిజాయితీ, సమానత్వానికి ప్రతీక అని, దేశ స్వాతంత్ర్యం కోసం కష్టపడి నిరంతరం పని చేశారన్నారు. గాంధీచూపిన మార్గంలో నడిచి గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని వారి ఆలోచనలకు తగ్గట్టుగా శాంతి మార్గంలో నడిచి దేశఅభివృద్ధికి పాటు పడాలని తెలిపారు. సీపీఎం ఆధ్వర్యంలో గాంధీ గంజ్‌లో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు, దేవరాజ్, శివకుమార్, లక్ష్మన్,రమణకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, మొయిజ్, రాజారెడ్డి, రాము పాల్గొన్నారు.

లింగంపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రపంచానికి ఆదర్శమైన వ్యక్తి గాంధీజీ అని వైశ్యసంఘం అధ్యక్షుడు చింతల రాజు అన్నారు. ప్రతిఒక్కరు గాంధీ చూపిన మార్గంలో ముందుకుసాగుదామన్నారు. కార్యక్రమంలో వైశ్యసంఘం నాయకులు కౌడ శ్రీను, కౌడ రవి, కొత్త దుర్గయ్య, వేణు, కృష్ణమూర్తి, విజయ్‌లతో పాటు నాయకులు ఉన్నారు.



బీబీపేటలో...

దోమకొండ,(బీబీపేట) అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దోమకొండ, బీబీపేట మడల కేంద్రాలతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

భిక్కనూరు, అక్టోబరు 03: భిక్కనూరు మండలకేంద్రంతో పాటుగా మండలంలోని అన్నిగ్రామాల్లో గురువారం జాతిపిత మహాత్మ గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని గాంధీజీ విగ్రహాలకు, చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు, ఆయాపార్టీల నాయకులు, ఆయాశాఖల అధికారులు, యువజన సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. గాంధీ సేవలను కొనియాడారు. ప్రతిఒక్కరు గాంధీ చూపిన మార్గంలో ముందుకుసాగుదామన్నారు. గాంధీ చెప్పినట్లుగా ఆడపిల్ల అర్ధరాత్రి నడిరోడ్డుపై తిరిగినప్పుడే వారికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ పనిచేయాలని, ఆడ వారికి స్వేచ్ఛ కల్పించాలని పేర్కొన్నారు. గాంధీ స్ఫూర్తితో గ్రామాల అభివృ చేయాలని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయాపార్టీల నాయకులు, ఆయాశాఖల మండల అధికారులు, సిబ్బంది, యువజనసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఇసన్నపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న గ్రామస్థులు

ఆలయ నిర్మాణానికి రూ.1.80లక్షల విరాళం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 03: ఎల్లారెడ్డి పురపాలక సంఘం పరిధిలోని 11వార్డు లింగారెడ్డిపేటలో నూతనంగా నిర్మిస్తున్న వీర హనుమాన్ ఆలయ నిర్మానాణికి శుక్రవారం మాజీ కౌన్సిలర్ భూంగారి రాములు రూ.లక్షా 80 వేలను అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయాన్ని పూర్తిగా రాతి కట్టడంతో నిర్మించడం జరుగుతుందని, గ్రామస్థులే దాదాపుగా రూ.80 లక్షల విరాళాలను ఇప్పటివరకు అందజేయడం జరిగిందన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- భద్రకాళీ
ప్రియ 35- లిటిల్ హార్ట్స్
దర్శన్- మిరాయి

బాన్సువాడ

మహేశ్వరి	ఓజీ
వెంకటేశ్వర	కాంతార

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230